## క్లుప్తంగా

### జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ

అల్లూరు: ఎంపీడీఓ కార్యాలయాన్ని శనివారం జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల అమల్లో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

### వలంటీర్ పోస్టులకు 14 దరఖాస్తులు

అల్లూరు: మండలంలో 9 వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 14 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీఓ శ్రీదేవి తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి 20వ తేదీ ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి ఉత్తర్వులు ఇస్తామన్నారు.

### ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రభుత్వ సహాయంతో గ్రేస్ ఫౌండేషన్ కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం, స్క్రీనింగ్ కార్యక్రమం జరిగింది. ఈ శిబిరంలో 480 జనరల్ ఓపీ నమోదు కాగా 185 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రేస్ ఫౌండేషన్ ఎంతో ఖర్చుతో కూడిన క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యాన్ని కావలిలో ఉచితంగా నిర్వహించడం ముదావహమన్నారు. రాష్ట్ర మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ డాక్టర్ డానియల్, డీఎంహెచ్‌ఓ ఎం.పెంచలయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బిజిత, డిస్ట్రిక్ట్ మైనార్టీ ఆఫీసర్ నిర్మలాదేవి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ పద్మావతి, మున్సిపల్ కమిషన్ ఇ.కిరణ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన



జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

కొండాపురం: ఈ నెల 20 నుంచి మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంపై ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు తహసీల్దార్, ఈఓపీఆర్డీలను రెండు గ్రూపులుగా ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 6.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు జగనన్న సురక్ష హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హుస్సేన్, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జానీ, వీర్వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సాహంగా స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

ఆత్మకూరు: కడపలో నిర్వహిస్తున్న వైఎస్సార్ రాష్ట్ర స్పోర్ట్స్ పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించే దేహదారుఢ్య పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఎంఈఓ షేక్ నజీర్‌బాషా ఈ పోటీలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన పోటీల్లో సుమారు 200 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ పోటీలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసినట్లు పీడీ తిరుపతయ్య తెలిపారు. త్వరలో వీరిని జిల్లా పోటీలకు పంపనున్నట్లు తెలిపారు.

### విద్యార్థుల కోసం బస్సు సౌకర్యం


ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మద్దిబోయిన వీరరఘు, తదితరులు

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆర్టీసీ అధికారులను కోరారు. మండలంలోని నాగులవరం, చెంచుల క్రిష్ణాపురం, బోగోలు, కప్పరాళ్లతిప్ప, ఉమామహేశ్వరపురం, ముంగమూరు, కడనూతల, కోవూరుపల్లి తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చేందుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మద్దిబోయిన వీరరఘు, మేకల శ్రీనివాసులు తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సూచనల మేరకు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కావలి ఆర్టీసీ డీఎంకు శనివారం వినతిపత్రం అందజేశారు.

# కడలి పుత్రుల కన్నీళ్లు తుడిచి..


సముద్రంలో మత్స్యకారుల సందడి




కడలి ఒడిలో చేపల వేటే జీవనాధారమైన మత్స్యకారులకు వేట విరామ సమయం గడ్డు కాలం. సముద్ర తీరంలో కడలి ఘోష వింటేనే హడలిపోతారు. భీతిల్లే అలల్లో ఊయలలు ఊగినంత అలవొకగా జలరాసిపై సాహస సమరం సాగించే మత్స్యకారులు ఆ రెండు నెలలు బతుకు పోరాటం చేస్తారు. ఎగిసిపడే కెరటాలను అవలీలగా దాటే కడలి పుత్రులు వేట నిషేధ కాలంలో జీవన సమరం సాగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మత్స్యకార కుటుంబాలను ఉదారంగా ఆదుకోవాల్సిన టీడీపీ ప్రభుత్వం కడలి పాల్జేసింది. ఐదేళ్ల అధికారంలో ఉంటే నాలుగేళ్ల మాత్రమే అదీ అరకొర సాయం.. అరకొర మందికి ఇచ్చి చేతులు దులుపుకుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టీడీపీ ప్రభుత్వం ఎగ్గొట్టిన ఏడాదికి సైతం గత ప్రభుత్వం ఇచ్చిన సాయంకంటే మిన్నగా పెంచి మంజూరు చేసి తన ఉదారతను చాటుకున్నారు.

- నాలుగేళ్ల వైఎస్ జగన్ పాలనలో ఐదు సార్లు మత్స్యకారులకు భరోసా
- చంద్రబాబు ఐదేళ్ల పాలనలో నాలుగు దఫాలే వేట విరామ సాయం
- టీడీపీ హయాంలో డీజిల్ సబ్సిడీలు ఎగనామం
- బీమా వర్తింపు రూ.5 లక్షలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో లీటరుకు రూ.9 సబ్సిడీ పెంపు
- బీమా పరిహారం సైతం రూ.10 లక్షలకు వర్తింపు

కావలి: సాగరాన్ని మదించి మత్స్య సంపదను ఒడిసి పట్టి బతుకు జీవనం చేయడం తప్ప మరే పని చేతకాని మత్స్యకార కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొండత అండగా నిలుస్తోంది. ఏడాదిలో పది నెలలే వేట సాగించేందుకు అనుమతి ఉన్నప్పటికీ ఈ కాలంలో తుఫాన్లు, అల్పపీడనాలు వంటి ప్రకృతి ప్రతికూలంలో కడలి కల్లోల పరిస్థితుల్లోనూ వేట సాగని పరిస్థితి. కేవలం వేటతోనే జీవనం సాగించే మత్స్యకారులకు ఏటా వేట నిషేధకాలంలో ఆ కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బతుకు భరోసా కల్పించారు. కావలి నియోజకవర్గంలో కావలి మండలం నందెమ్మపురం నుంచి అల్లూరు మండలం ఆదినారాయణపురం వరకు 56 కి.మీ. సముద్ర తీరం ఉంది. కావలి, బోగోలు, అల్లూరు మండలాల్లో 35 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు, సముద్రం ఎన్నో ఆటు-పోట్లు వంటి సహజ సిద్ధమైన ప్రకృతి ప్రతి బంధకాలతో మత్స్యకారులు సముద్రంపై నిత్యం బతుకు పోరాటం చేయాల్సిందే.

**రెండు నెలలు చేపల వేట నిషేధం**

సముద్ర జలాల్లో చేపలు, రొయ్యల సంతానోత్పత్తి కాలంగా తల్లి చేపలు, రొయ్యల సంరక్షణ కోసం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో వేటను ప్రభుత్వం నిషేధాన్ని కొనసాగిస్తోంది. దీంతో ఉపాధి కోల్పోయే అర్హులైన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయంతో జీవన భృతిని కల్పిస్తోంది. అయితే గత ప్రభుత్వాలు ఈ పథకాన్ని కంటితుడుపుగా అమలు చేసింది. అరకొర మందికి.. అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకునేది. ఈ సాయం కోసం మత్స్యకారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడానికే సగం డబ్బును వెచ్చించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు సాయం అందించే విషయంలో ఎంతో ఉదారంగా వ్యవహరించారు. మత్స్యశాఖ కమిషన్ ఆధ్వర్యంలో అధికారులు సముద్ర తీరం ప్రాంతంలో ఉండే ప్రతి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుంది. ఆ విధంగా గుర్తించిన లబ్ధిదారులను వివరాలను సేకరించి అర్హులైన వారికి ప్రతి ఏటా ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా ద్వారా నగదు అందిస్తున్నారు.

**డీజిల్‌పై సబ్సిడీ టీడీపీ ఎగనామం**

నాటి చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారులకు డీజిల్‌కు పైసా సబ్సిడీ అందించిన పాపాన పోలేదు. అప్పట్లో లీటర్ డీజిల్‌పై రూ.6.03 సబ్సిడీ ఇస్తానని చెప్పింది. డీజిల్ కొనుగోలు చేసినప్పుడు పెట్రోల్ బంకులు నుంచి తీసుకునే బిల్లులను మత్స్యశాఖ అధికారులకు అందజేస్తే, వీలును బట్టి సబ్సిడీ నగదు ఇస్తామని చెప్పిందే కానీ ఐదేళ్ల కాలంలో నయాపైసా కూడా చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారులకు ఇవ్వనే లేదు.

### టీడీపీ నాలుగేళ్లలో రూ.2 వేలే సాయం



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు ఎల్లంగారి పార్వతయ్య. వయస్సు 58 ఏళ్లు. కావలి మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన మత్స్యకారుడు. ఇతనికి చేపల వేట నిషేధ సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మూడు దఫాలుగా ఆర్థిక సాయం అందితే.. చివరికి అతనికి మిగిలింది రూ.2 వేలే. తనకు ఆర్థిక సహాయం మంజూరు చేయించుకునేందుకు తన అర్హతలను తెలియజేసే వివరాలను తీసుకుని మత్స్యశాఖ అధికారుల చుట్టూ తిరిగేవాడు. ఏడాదికి వెయ్యి ఖర్చులు అయ్యాయి. తొలి రెండేళ్లు రూ.2 వేల వంతున రూ.4 వేలు సాయం అందితే అందులో ఏడాదికి వెయ్యి చొప్పున రూ.2 వేలు పోతే మిగిలింది రూ.2 వేలు. ఇక మూడు, నాలుగో ఏడాదిలో తిరగడానికే రూ.4 వేలు ఖర్చు అయింది. అయితే మూడో ఏడాది మాత్రమే అతనికి రూ.4 వేలు జమ అయింది. నాలుగో ఏడాది అసలు జమ కాలేదు. ఈ రెండేళ్లకు ఖర్చులకు, ప్రభుత్వ సాయం సరిపోయింది. ఏమీ మిగల్లేదు. మొత్తంగా పార్వతయ్యకు నాలుగేళ్లలో దక్కింది రూ.2 వేలు మాత్రమే.


**వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.50 వేలు**

అదే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రూపాయి ఖర్చు లేకుండా.. తిరిగే తిప్పట్లు లేకుండా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటికే వచ్చి అన్ని విరాలు రాసుకొని, కావాల్సిన కాగితాలు జెరాక్సులు తీసుకెళ్లారు. 2019 నుంచి వరుసగా ఇప్పటికి ఐదు సార్లు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందింది. ఏడాదికి రూ.10,000 చొప్పున రూ.50,000 నగదు ఇతని అకౌంట్‌లో జమ అయ్యాయి.

**టీడీపీ హయాంలో అందిన సాయం**




**వైఎస్సార్‌సీపీ పాలనలో సాయం**




### ఇప్పుడు సంతోషంగా ఉంది



మత్స్యకారుల విషయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని రకాలుగా మేలు జరుగుతున్నాయి. సీఎం బటన్ నొక్కగానే మాకు రెండు మూడు రోజుల్లో మా అకౌంట్‌లో రూ.10,000 డబ్బులు పడిపోతుంది. ఇంత కన్నా మాకు మేలు చేసిన వారు ఎవరూ లేరు. గతంలో టీడీపీ హయాంలో మాకు రూ.2,000, రూ.4,000 ఇచ్చినా.. సరిగా పడేది కాదు. అసలు పడుతాయో, లేదో కూడా తెలియదు. పడినా ఎప్పుడు పడుతాయో తెలియదు. మత్స్యకారులకు జగన్ ప్రభుత్వం వరంగా భావిస్తున్నాం.

– కాటంగారి శీను, మత్స్యకారుడు, కొత్తసత్రం

### జగన్ ప్రభుత్వానికి రుణపడి ఉన్నాం



మా మత్స్యకారులకు జగన్ చేస్తామని చెప్పినవన్నీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచి చేస్తూనే ఉన్నారు. చేపల వేట నిషేధ కాలానికి ఆర్థిక సహాయం రూ.10,000 ఇస్తామని ఎన్నికల్లో చేసిన వాగ్దానాన్ని, చంద్రబాబు ప్రభుత్వం పైసా ఇవ్వకుండా ఎగ్గొట్టిన చివరి సంవత్సరానికి జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. ఇప్పటికి ఐదుసార్లు ఇస్తే, సముద్రంలో చేపలు వేట చేస్తే ప్రతి మత్స్యకారుడికి అందింది. ఏ ఒక్కరి చుట్టూ తిరగకుండానే, మత్స్యకారుల ఇళ్ల వద్దకే అధికారులు వచ్చి వివరాలు రాసుకుని పోతున్నారు. నయాపైసా ఖర్చు లేకుండానే ఇంటికే అన్ని పథకాలు అందిస్తున్నారు. మా మత్స్యకారులు జగన్‌కు రుణపడి ఉన్నారు.

– కొమారి రాజు, మత్స్యకారుల సంఘం నాయకుడు, కావలి

### సబ్సిడీ రూ.9లకు పెంపు.. స్పాట్‌లోనే తగ్గింపు

ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం డీజిల్‌పై లీటరుకు గతంలో ఉన్న రూ.6.03 సబ్సిడీని రూ.9లకు పెంచింది. మత్స్యకారులకు స్మార్ట్ కార్డులు ఇచ్చారు. వీటి ద్వారా సబ్సిడీ మొత్తాన్ని మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని డీజిల్‌కు చెల్లించే వెసులుబాటు కల్పించారు. పెట్రోల్ బంకులో డీజిల్ కొనుగోలు చేయగానే మొత్తం బిల్లు చెల్లింపు చేసేటప్పుడు మత్స్యకారుడు స్మార్ట్ కార్డ్‌ను ఇస్తే, లీటర్ కు రూ.9 చొప్పున ప్రభుత్వ సబ్సిడీ పోను మిగిలిన నగదు చెల్లించుకుంటున్నారు. చేపల వేట సమయంలో దురదృష్టవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాల ఇచ్చే ఆర్థిక సహాయాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారు.


వేటకు వెళ్లి ఒడ్డుకు చేరుకుంటున్న మత్స్యకారులు

# రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

- ఆర్డీఓ కరుణకుమారి

అనుమసముద్రంపేట: ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి సూచించారు. ఏఎస్‌పేట మండలం రాజవోలు సచివాలయం ఆవరణలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు సంబంధించిన చుక్కల భూముల సమస్యలతో పాటు వారసత్వ భూములు, అగ్రిమెంట్ ద్వారా సంక్రమించిన భూములకు రైతులు పూర్తి వివరాలతో అందజేస్తే పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఏవీ రమణరావు, సర్పంచ్ నరసయ్య, పొనుగోడు సర్పంచ్ పద్మయ్యనాయుడు, వీఆర్‌ఓ చిన్నమ్మ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రామాంజనేయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సౌమ్య, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ విజయమ్మ పాల్గొన్నారు.

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

కావలిరూరల్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తహసీల్దారు మాధవరెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, ఆర్‌సీపాళెం రైతు భరోసా కేంద్రాల్లో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా రైతులు చుక్కల భూముల సమస్యలతో ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క సంతకంతో పరిష్కరించారన్నారు. సర్పంచ్‌లు చిమ్మిలి శ్రీహరి, వేముల రాజేంద్ర, ఆర్‌ఐ శివకుమార్, వీఆర్‌ఓ సంయుక్త, పంచాయతీ కార్యదర్శులు డి.గీత, సుమన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు, రేపు అన్నారెడ్డిపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం సచివాలయం పరిధిలో ఆది, సోమవారాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి శనివారం తెలిపారు. సాయంత్రం 4.30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

# లోకేశ్.. నీ స్థాయి తెలుసుకుని మాట్లాడు

- వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని నువ్వు సీఎం, ఎమ్మెల్యేను విమర్శిస్తావా?
- వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం


మాట్లాడుతున్న అనంతసాగరం ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

చేజర్ల: 'లోకేశ్... రాష్ట్రంలో వార్డు మెంబరుగా కూడా గెలవని నువ్వు 151 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, 80 వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని విమర్శిస్తున్నావు. నీ స్థాయి తెలుసుకుని మాట్లాడు' పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. సంక్షేమ పాలన, అభివృద్ధిలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదని తెలుసుకోవాలన్నారు. శనివారం అనంతసాగరంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బిజివేముల ఓబుల్‌రెడ్డి, మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, వైస్ ఎంపీపీ అల్లంపాటి సుధాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతసాగరంలో జరిగిన సభలో లోకేశ్ చేసిన విమర్శలను ఖండించారు. సభలో ఆయన మాట్లాడిన ఏ ఒక్క మాటలోనూ నిజం లేదన్నారు. పచ్చి అబద్ధాలు మాట్లాడేసి వెళ్లాడని దుయ్యబట్టారు. నువ్వు పాదయాత్ర కాదు పాకుడు యాత్ర చేసినా లాభం లేదన్నారు. 2019లో ప్రజలు 23 సీట్లు ఇచ్చారని, 2024 అవి కూడా ఇవ్వరన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విమర్శలు చేసే ముందు తమ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బిజివేముల ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోస్టల్ కారిడార్ అభివృద్ధి, ఎయిర్ పోర్ట్‌ల నిర్మాణంలో రాష్ట్ర రెవెన్యూ పెంచేలా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో రాష్ట్రాన్ని దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఆత్మకూరు బస్టాండ్ నిర్మాణం పూర్తి చేసి ఈ నెల 23న ప్రారంభిస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 24న ఆత్మకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ పాఠశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బట్రెడ్డి జనార్దన్ రెడ్డి, శాప్ డైరెక్టర్ కే నర్సింహులు, అనంతసాగరం సర్పంచ్ శోభ పాల్గొన్నారు.

# జగనన్న ఆణిముత్యాలకు సత్కారం


సత్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మంత్రి కాకాణి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఇంటర్ విద్యార్థిని స్వాతి


విద్యార్థిని అమూల్య, ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

కావలి: ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో చదివి టెన్త్ ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలుగా గుర్తించి శనివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సన్మానించారు. పట్టణంలోని పాతూరులో ఉన్న మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హైస్కూల్ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారిని సత్కరించారు.

**10వ తరగతి ఆణిముత్యాలు**

పాతూరు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని పఠాన్ హీనా రుక్సర్, కావలి పట్టణంలోని వెంగళరావు నగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని తుమ్మల సుమాంజలిలకు మొదటి బహుమతిగా రూ.15,000 నగదు, మెడల్, షీల్డ్, సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. కావలి పట్టణంలోని వెంగళరావునగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని పొన్నపూల రూపశ్రీ ప్రహర్షితకు రూ.10,000 నగదు, మెడల్, షీల్డు, సర్టిఫికెట్లను తృతీయ బహుమతిగా బోగోలు మండలం పాత బిట్రగుంట జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పరుసు హేమంత్ కుమార్‌కు రూ.5,000 నగదు, మెడల్, షీల్డ్, సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. నియోజకవర్గంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల స్థాయిలో 1, 2,3 స్థానాలను సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు సర్టిఫికెట్లు అంజేశారు. వారికి వరుసగా రూ.3,000, రూ.2,000, రూ.1,000 నగదును ఆయా హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల అకౌంట్‌లో ప్రభుత్వం జమ చేస్తుందని, అప్పుడు విద్యార్థులకు అందజేస్తారని ప్రకటించారు.

**ఇంటర్ ఆణిముత్యాలు**

కావలి రూరల్ మండలం అన్నగారిపాళెం పంచాయతీలోని ఒట్టూరు మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలకు చెందిన అడపాల మంజూషా బైపీసీ విభాగంలో అత్యధిక మార్కులు సాధించడంతో రూ.15,000 నగదు, మెడల్, సర్టిఫికెట్‌లను ఎమ్మెల్యే అందజేశారు. పట్టణంలోని ముసునూరు కస్తూర్బా జూనియర్ కళాశాల విద్యార్థిని దావులూరి లక్ష్మీప్రియ ఎంపీసీ, దగదర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని కోట పల్లవి సీఈసీ, గున్న భవ్యశ్రీ హెచ్‌ఈసీ విభాగంలో అత్యధిక మార్కులు సాధించడంతో రూ.15,000 నగదు, మెడల్, సర్టిఫికెట్లను అందజేశారు.

**జగనన్న ఆణిముత్యం ఇంటర్ విద్యార్థిని**

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం నందవరం మోడల్ స్కూల్ విద్యార్థిని ముప్పాళ్ల స్వాతి ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యానికి ఎంపికైన నేపథ్యంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ చేతుల మీదుగా నెల్లూరులో శనివారం రూ.50 వేలు ప్రోత్సాహక నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందుకున్నారు. విద్యార్థినితో పాటు కళాశాల ప్రిన్సిపల్ పేట శ్రీనివాసులురెడ్డి, తల్లిదండ్రులను కూడా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థిని స్వాతిని పలువురు అభినందించారు.

**జగనన్న అణిముత్యం కేజీబీవీ విద్యార్థిని**

కలిగిరి: కలిగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థిని అమూల్య టెన్త్‌లో 574 మార్కులు సాధించి జగనన్న ఆణిముత్యాలు పురస్కారాన్ని అందుకుంది. నెల్లూరులోని తిక్కన ప్రాంగణంలో శనివారం వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినాయణన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా రూ. 50 వేల చెక్కు, ప్రసంసా పత్రం అందుకుంది. అమూల్యతో పాటు ప్రిన్సిపల్ సుప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు.


మంత్రి, కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

**జగనన్న ఆణిముత్యాల పురస్కారాలు**

దుత్తలూరు: స్థానిక ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలు ప్రతిభా పురస్కారాలు అందుకున్నారని ప్రిన్సిపల్ జె.సైమన్ రావు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థిని బి.ప్రియాంక (సీఈసీ) నియోజకవర్గ స్థాయిలో, పదో తరగతిలో బి.వెంకటనాగలక్ష్మి జిల్లా స్థాయిలో మూడో స్థానానికి ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున నగదుతో పాటు సర్టిఫికెట్, షీల్డ్స్ శనివారం నెల్లూరులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ అందజేశారన్నారు.

# ప్రణాళికాబద్ధంగా జగనన్న సురక్ష

- డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ కనకదుర్గాభవానీ

బిట్రగుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్నీ శాఖల అధికారులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని డివిజనల్ అభివృద్ధి అధికారిణి కనకదుర్గాభవానీ అన్నారు. జగనన్న సురక్ష పథకం అమలుపై మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బందితో డీఎల్‌డీఓ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేలా, వారి సమస్యలు పరిష్కరించేలా జగనన్న సురక్ష పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దారు రెండు బృందాలుగా ఏర్పడి జూలై 1వ తేదీ నుంచి సచివాలయాలు సందర్శిస్తారని తెలిపారు. ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలను అక్కడికక్కడే మంజూరు చేస్తారని వివరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వీలుగా మండల స్థాయి అధికారులు తమకు కేటాయించిన గ్రామ సచివాలయాల సిబ్బందితో సమన్వయం చేసుకుని వివరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. వలంటీర్లకు కేటాయించిన ప్రతి కుటుంబాన్ని సందర్శించి వారి సమస్యలు, వారికి అవసరమైన ధృవీకరణ పత్రాల వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్, ఎంపీడీఓ సుబ్బారావు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.